ఐపీఎల్ ముచ్చట్లు

గ్లెన్ 'డక్'వెల్

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

0, 3, 28, 0, 1, 0.. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ చేసిన పరుగులివి. 2021 నుంచి ఆర్సీబీకి ఆడుతున్న ఈ ఆస్ట్రేలియా విధ్వంసకవీరుడు.. గత మూడు సీజన్లలో అదరగొట్టాడు. 2021లో 513 పరుగులు చేసిన మ్యాక్సీ.. 2022లో 301, 2023లో 400 రన్స్ చేశాడు. గతేడాది కోహ్లీ, డుప్లెసిస్‌తో కలిసి మ్యాక్స్‌వెల్ (అభిమానులు ఈ త్రయాన్ని కేజీఎఫ్ అని పిలుచుకున్నారు) ప్రత్యర్థుల బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. బెంగళూరు హోంగ్రౌండ్ 'చిన్నస్వామి'లో అయితే ఈ ఆసీస్ చిచ్చరపిడుగు విధ్వంసం తారాస్థాయికి చేరేది. మ్యాక్సీ క్రీజులోకి వచ్చాడంటే బంతి మ్యాగ్జిమమ్ గాల్లోనో లేదంటే స్టాండ్స్‌లో ప్రేక్షకుల చేతుల్లోనో ఉండేది. గత సీజన్‌లో పూనకం వచ్చినవాడిగా ఊగిపోయిన అతడి స్ట్రైక్ రేట్ 183.29గా నమోదైంది. కానీ ఈ సీజన్‌లో మాత్రం అతడు ఘోరంగా విఫలమవుతున్నాడు. 2024 సీజన్ 6 ఇన్నింగ్స్‌లలో అతడు చేసింది 32 పరుగులే. అందులోనూ మూడు డకౌట్స్. కోల్‌కతాతో మ్యాచ్‌లో ముక్కీ మూలుగుతూ 28 పరుగులు చేసినా అదీ కేకేఆర్ ఆటగాళ్లు మూడు క్యాచ్‌లు మిస్ చేస్తే చేసినవి. చెన్నై, లక్నో, ముంబైతో మ్యాచ్‌లలో మ్యాక్సీ అలా వచ్చి ఇలా వెళ్లాడు.

గతేడాది ఐపీఎల్ తర్వాత వన్డే వరల్డ్ కప్, భారత్‌లో టీ20 సిరీస్, ఆస్ట్రేలియాలో బిగ్ బాష్ లీగ్‌లోనూ ఫర్వాలేదనిపించిన మ్యాక్స్‌వెల్.. తాజా సీజన్‌లో మాత్రం తన మార్కును చూపలేకపోతున్నాడు. ఆరంభంలో వరుస మ్యాచ్‌లలో విఫలమైన అతడు.. ఆర్సీబీ కష్టాల్లో ఉన్నప్పుడు వచ్చి ఒత్తిడికి చిత్తవుతున్నాడు. ఆర్సీబీ బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలకమైన మ్యాక్సీ ఇకనైనా మేలుకోకుంటే తుది జట్టులో అతడిని పక్కనబెట్టడంతో పాటు టీమ్ నుంచి తప్పించినా ఆశ్చర్యపోవాల్సిన పన్లేదు. స్పిన్ అంటేనే ఊగిపోయి బ్యాటింగ్ చేసే ఈ ఆసీస్ వీరుడు.. తాజా సీజన్‌లో స్పిన్నర్లకే మూడు సార్లు వికెట్ సమర్పించుకున్నాడు.

'ఒత్తిడి సమయాల్లో ఆర్సీబీ స్టార్ బ్యాటింగ్ విభాగం సరైన ప్రదర్శన చేయదు. వేలంలో భారీ ధర దక్కించుకుంటున్న అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లు దారుణంగా విఫలమవుతున్నారు. క్లిష్ట సమయాల్లో అందరూ డ్రెస్సింగ్ రూములోనే ఉంటే దేశవాళీ ప్లేయర్లు తాకత్తుకు మించి రాణిస్తున్నారు' *అన్న రాయుడు మాటలను నిజం చేస్తూ మ్యాక్స్‌వెల్ వైఫల్య ప్రదర్శన కొనసాగిస్తున్నాడు.*

భారత్‌కు నాలుగో ఓటమి

- **ఆస్ట్రేలియాతో హాకీ సిరీస్**

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత హాకీ జట్టుకు మరో ఓటమి. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇది వరకే మూడింట్లో ఓడిన భారత్.. శుక్రవారం పెర్త్ వేదికగా ముగిసిన నాలుగో మ్యాచ్‌లోనూ 1-3 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 12వ నిమిషంలో గోల్ కొట్టి భారత్‌ను ఆధిక్యంలోకి తెచ్చాడు. కానీ తొలి క్వార్టర్ ముగిశాక ఆస్ట్రేలియా పుంజుకుంది. భారత గోల్ పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని దాడికి దిగింది. ఆ జట్టు తరపున హేవార్డ్ (19, 47) రెండు గోల్స్ చేయగా జాక్ వీల్స్ 54వ నిమిషంలో గోల్ కొట్టాడు.

'చెఫ్ డి మిషన్'కు మేరీకోమ్ రాజీనామా

కీలక బాధ్యతలకు దిగ్గజ బాక్సర్ దూరం

ఢిల్లీ:పారిస్ వేదికగా జరుగనున్న ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో భారత బృందానికి 'చెఫ్ డి మిషన్'గా నియమితురాలైన దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ తాజాగా ఆ బాధ్యతల నుంచి తప్పుకుంది. వ్యక్తిగత కారణాలతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుపుతూ ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు లేఖ రాసింది. 'ఈ దేశానికి సేవ చేయడాన్ని నేను గౌరవంగా భావిస్తా. అందుకు నేను మానసికంగా సిద్ధంగా ఉన్నా. అయితే వ్యక్తిగత కారణాలతో నేను ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నా' అని లేఖలో పేర్కొంది.

ఇప్పట్లో రిటైర్మెంట్ ఆలోచన లేదు : రోహిత్

ముంబై: తనకు ఇప్పుడప్పుడే రిటైర్మెంట్ ఆలోచన లేదని, అంతర్జాతీయ క్రికెట్‌లో మరికొన్నేళ్ల పాటు కొనసాగుతానని భారత క్రికెట్ జట్టు సారథి రోహిత్‌శర్మ అన్నాడు. ప్రముఖ యూట్యూబర్ గౌరవ్ కపూర్ 'బ్రేక్ ఫాస్ట్ విత్ చాంపియన్స్'లో రోహిత్ మాట్లాడుతూ..'నేను రిటైర్మెంట్ గురించి ఆలోచించడం లేదు. కానీ జీవితం మనల్ని ఎప్పుడు ఎటు తీసుకెళ్తుందో తెలియదు. ప్రస్తుతానికైతే నేను బాగానే ఆడుతున్నా. దీనిని మరికొన్నేళ్ల పాటు కొనసాగిస్తా' అని అన్నాడు.

గుకేశ్ ఓటమి

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్‌కు ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన ఏడో రౌండ్ పోరులో గుకేశ్..ఫ్రాన్స్‌కు చెందిన ఫిరోజ అలీరెజా చేతిలో పరాజయం ఎదుర్కొన్నాడు. నిజత్ అబసోవ్‌తో గేమ్‌ను విదిత్ గుజరాతి డ్రా చేసుకోగా, ఫాబియానో కరువానను ప్రజ్ఞానంద నిలువరించాడు.

అయుష్ పోరాటం వృథా

ఢిల్లీ కమాల్

జేక్ ఫ్రేసర్ మెరుపు అర్ధ సెంచరీ • కుల్దీప్ మాయతో లక్నో కుదేలు

వరుసగా రెండు అపజయాల తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ విజయాల బాట పట్టింది. మూడు విజయాలతో దూకుడు మీదున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు సొంత మైదానం ఏకనా క్రికెట్ స్టేడియంలో ఓటమి రుచిచూపించింది. ఇక్కడ రెండో ఇన్నింగ్స్‌లో 160 ప్లస్ స్కోరును ఛేదించడానికి మిగతా జట్లు నానా తంటాలు పడుతుంటే ఢిల్లీ మాత్రం కమాల్ చేసింది. అరంగేట్ర మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కుర్రాడు జేక్ ఫ్రేసర్ లక్నో బౌలర్లపై భారీ షాట్లతో విరుచుకుపడి ఢిల్లీకి విజయాన్ని కట్టబెట్టాడు. అంతకుముందు లక్నో బ్యాటింగ్ ఆర్డర్‌ను కుల్దీప్, ఖలీల్ దెబ్బతీసినా అయుష్ బదోని అద్భుత పోరాటంతో ఆ జట్టు పోరాడగలిగే స్కోరు సాధించింది.

ఫ్రేసర్ (55)

లక్నో : ఐపీఎల్-17లో స్వల్ప లక్ష్యాలను కాపాడుకుంటూ వరుసగా మూడు విజయాలు దక్కించుకున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు సొంత మైదానం లో ఢిల్లీ క్యాపిటల్స్ షాకిచ్చింది. లక్నో నిర్దేశించిన 168 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలోనే ఛేదించింది. ఈ లీగ్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న యువ బ్యాటర్ జేక్ ఫ్రేసర్ (35 బంతుల్లో 55, 2 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ రిషభ్ పంత్ (24 బంతుల్లో 41, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో ఆరు వికెట్ల తేడాతో లక్నోను ఓడించింది. తొలుత లక్నోను కుల్దీప్ యాదవ్ (3/20), ఖలీల్ (2/41) కట్టడి చేసినా అయుష్ బదోని (35 బంతుల్లో 55 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. కుల్దీప్‌యాదవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

కుల్దీప్ (3/20)

ఖలీల్, కుల్దీప్ ధాటికి లక్నో కుదేలు

లక్నో ఇన్నింగ్స్ ఆరంభంలోనే నాలుగు బౌండరీలతో జోరు మీదున్న క్వింటన్ డికాక్ (19) ఖలీల్ అహ్మద్‌కు మూడో ఓవర్లో వికెట్ల ముందు దొరికిపోయాడు. తన మరుసటి ఓవర్లో ఖలీల్.. పడిక్కల్ (3)నూ అదే రీతిలో పెవిలియన్ పంపాడు. కుల్దీప్ రాకతో లక్నో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఏడో ఓవర్ వేసిన అతడు.. వరుస బంతుల్లో స్టోయినిస్ (8), పూరన్ (0)లను ఔట్ చేసి లక్నోకు ఒత్తిడిలోకి నెట్టాడు. అతడే వేసిన 9వ ఓవర్లో లక్నో సారథి రాహుల్.. పంత్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. దీపక్ హుడా (10) మళ్లీ నిరాశపరచగా కృనాల్ పాండ్యా (3)ను ముకేశ్ కుమార్ ఔట్ చేయడంతో లక్నో 94 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది.

బదోని బాదుడు..

ఢిల్లీ బౌలర్ల విజృంభణతో 120 పరుగులు చేస్తే గొప్ప అనుకున్న లక్నో 167 పరుగులు చేసిందంటే దానికి కారణం బదోనినే. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన బదోని 17వ ఓవర్ నుంచి గేర్ మార్చాడు. ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదిన అతడు.. 18వ ఓవర్లో రెండు బౌండరీలు సాధించి 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

లక్నో : 20 ఓవర్లలో 167/7 (బదోని 55 నాటౌట్, రాహుల్ 39, కుల్దీప్ 3/20, ఖలీల్ 2/41). ఢిల్లీ : 18.1 ఓవర్లలో 170/4 (ఫ్రేసర్ 55, పంత్ 41, బిష్ణోయ్ 2/25, నవీన్ 1/24)

లక్నోలో విజయవంతంగా లక్ష్యఛేదన..

ఢిల్లీ ధనాధన్..

ఛేదనలో ఢిల్లీకి మరోసారి శుభారంభం దక్కలేదు. గత రెండు మ్యాచ్‌లలో విఫలమైన వార్నర్ (8) మరోసారి నిరాశపరిచాడు. కానీ పృథ్వీ షా, జేక్ ఫ్రేసర్ మాత్రం బౌండరీలు, సిక్సర్లతో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. నవీన్ ఉల్ హక్ బౌలింగ్‌లో రెండు, అర్షద్, కృనాల్ ఓవర్లలోనూ షా బంతిని బౌండరీ లైన్ దాటించాడు.

ఫ్రేసర్.. నో ప్రెషర్

వార్నర్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన జేక్ ఫ్రేసర్ ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న ఈ ఆస్ట్రేలియా కుర్రాడు.. బ్యాటర్లకు పెద్దగా అనుకూలించని లక్నో పిచ్‌పై ధాటిగా ఆడాడు. కృనాల్ 13వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లతో అలరించాడు. యశ్ ఠాకూర్ 14వ ఓవర్లో తొలి బంతికి బౌండరీ కొట్టిన అతడు.. రెండో బంతికి 3 పరుగులు తీసి 31 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేశాడు.

పిల్లల స్కూల్ ఫీజు ఐపీఎల్ మ్యాచ్‌కు

- **ధోనీని చూసేందుకు 64వేల ఖర్చు**

చెన్నై: అభిమానం వెర్రితలలు వేయడమంటే ఇదేనేమో! చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజ క్రికెటర్ ధోనీ ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఓ వీరాభిమాని చేసిన పని అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. కోల్‌కతా-చెన్నై మ్యాచ్ కోసం సదరు ఫ్యాన్..తన పిల్లల స్కూల్ ఫీజును వాడాడు. అది కూడా బ్లాక్‌లో ఏకంగా 64,000 పెట్టి టికెట్లు కొని మరీ మ్యాచ్ చూశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత టికెట్ల కోసం ఇలా స్కూల్ ఫీజు వాడనని అతను చెప్పుకురావడం ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ధోనీ ఆటను స్టేడియంలో చూసేందుకు ఇలా చేశానన్న అతను ముగ్గురు పిల్లలు చాలా సంతోషించారని పేర్కొన్నాడు. అయితే పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాల్సిందిపోయి ఇదేం పిచ్చి పని అంటూ సదరు అభిమానిపై దుమ్మెత్తిపోస్తున్నారు.

నిమిషాల్లోనే ఐపీఎల్ టికెట్లు మాయం!

ఎస్ఆర్‌హెచ్‌పై ఫ్యాన్స్ ట్రోలింగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అభిమానులకు మరోమారు నిరాశే ఎదురైంది. తాము ఎంతగానో అభిమానించే ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకున్న ఫ్యాన్స్ ఆశలు అడిఆశలయ్యాయి. ఈ నెల 25వ తేదీన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో పాటు మే 2న లక్నో సూపర్‌జెయింట్స్‌తో జరిగే మ్యాచ్‌ల కోసం పేటీఎమ్‌లో శుక్రవారం టికెట్లు అందుబాటులో ఉంచారు. అయితే అలా వెబ్‌సైట్ ఓపెన్ అయిందో లేదో టికెట్లు చూస్తుండగానే మాయం అయిపోయాయి. తమ అభిమాన క్రికెటర్ల ఆటను చూసేందుకు అప్పటి వరకు ఓపికగా ఉన్న ఫ్యాన్స్‌కు ఆఖరికి నిరాశే ఎదురైంది. ఓవైపు ఒక్కో స్టాండ్ సోల్డ్‌ఔట్ అంటూ మెస్సెజ్‌లు రాగా, చివరికి నిమిషాల వ్యవధిలో వేలాది టికెట్లు గాయబ్ అయ్యాయి. దీనిపై అభిమానులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	5	4	1	0.87	8
కోల్‌కతా	4	3	1	1.52	6
చెన్నై	5	3	2	0.66	6
లక్నో	5	3	2	0.43	6
హైదరాబాద్	5	3	2	0.34	6
గుజరాత్	6	3	3	-0.63	6
ముంబై	5	2	3	-0.07	4
పంజాబ్	5	2	3	-0.19	4
ఢిల్లీ	6	2	4	-0.97	4
బెంగళూరు	6	1	5	-1.12	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.